

పెద్దేరు జలాశయం నుంచి నీరు విడుదల

మాడుగుల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు భారీగా జలాశయంలోకి వచ్చి చేరింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, శనివారం సాయంత్రానికి 136.65 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో 193 క్యూసెక్కులు నమోదైందని, నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున జలాశయం మూడో గేటు తెరిచి 400 క్యూసెక్కుల నీరు రాత్రి తొమ్మిది గంటలకు విడిచిపెట్టినట్టు జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

చెత్త సమస్యకు పరిష్కారం లేదా?

- తీవ్ర దుర్గంధంతో పరిసర ప్రాంతాల ప్రజల ఇబ్బందులు
- ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి మరిచిపోతున్న నేతలు
- రెండు దశాబ్దాలుగా ఇదే తీరు
- డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అనకాపల్లి వాసుల వేడుకోలు

డంపింగ్ యార్డు లేక జీవీఎంసీ కార్యాలయ ప్రాంగణంలోనే చెత్త నిల్వ



అనకాపల్లిలో జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణంలో పేరుకుపోయిన చెత్త

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి పట్టణ వాసులను డంపింగ్ యార్డు సమస్య వేధిస్తోంది. ఇక్కడ డంపింగ్ యార్డు లేకపోవడంతో జీవీఎంసీ జోనల్ కార్యాలయ ప్రాంగణంలోనే చెత్త నిల్వ చేయాల్సి వస్తోంది. తీవ్ర దుర్గంధంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రెండు దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు.

జీవీఎంసీ జోనల్ పరిధిలో 80 వేలకుపైగా గృహాలు ఉన్నాయి. సుమారు 1.2 లక్షల మంది జనాభా ఉన్నారు. జనాభా పెరుగుదలకు తగ్గట్టు నగరం విస్తరిస్తున్నా డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం లభించడం లేదు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా జీవీఎంసీ అధికారులు సుమారు 35 చెత్త సేకరణ మినీ వాహనాలను, 4 ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఇంటింటా సేకరించిన చెత్తను పట్టణ నడిబొడ్డున ఉడ్‌పేట-నెహ్రూచౌక్‌కు మధ్యలో ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయంలోనే పోస్తున్నారు. ఒకటి, రెండురోజులకు ఒకసారి జీవీఎంసీ పరిధిలో ఉన్న ఆరు లారీల్లో ఈ చెత్తను మధురవాడకు తరలిస్తున్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయం పరిసరాల్లో వివిధ వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, గృహాలు ఉన్నాయి. పట్టణానికి మధ్యలో ఉన్న కార్యాలయం ప్రాంగణంలోనే చెత్త నిల్వ చేయడం వలన వెలువడుతున్న దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో శారదా నగర్‌లో డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని కేటాయించగా, స్థానికులు అభ్యంతరం చెప్పడంతో వేరొక ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. తరువాత అనకాపల్లి మండలం అచ్చెయ్యపేట పరిసరాల్లో ఏర్పాటు చేయాలని భావించగా, ఆ ప్రాంత వాసులు డంపింగ్ యార్డు ఇక్కడ వద్దంటూ అడ్డుకున్నారు. దీంతో దీర్ఘకాలంగా అనకాపల్లి పట్టణంలో చెత్త సమస్య వేధిస్తోంది.

కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు

అనకాపల్లి పట్టణంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా ప్రతిపాదనలు ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. 2019 ఎన్నికల ముందు అప్పటి వైసీపీ నాయకులు డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో డంపింగ్ యార్డు ఊసెత్తలేదు. స్థానికులు అనేక పర్యాయాలు అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి తమ గోడు వినిపించినా డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం లభించలేదు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ డంపింగ్ యార్డు సమస్యకు ... మిగతా 8వ పేజీలో

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

తయారీ, నిల్వపై కఠిన చర్యలు

- లైసెన్స్‌దారులు మాత్రమే విక్రయాలు జరపాలి
- ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో బాణసంచా షాపును పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి అని, అలాగే అనుమతి లేకుండా బాణసంచా తయారీ, నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. దీపావళి నేపథ్యంలో శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అగ్నిప్రమాదాల నివారణకు ప్రభుత్వం కొన్ని నిబంధనలు అమలు చేస్తోందని, ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని కోరారు. లైసెన్స్ పొందిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయించాలని, లేకుండా అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ నిల్వలు, విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనుకోకుండా ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే ఫైర్ స్టేషన్ 101, పోలీస్ డయల్ 100, 112, లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

బాణసంచా దుకాణాల పరిశీలన

అనకాపల్లి టౌన్ : అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఎస్పీ తుహిన్‌సిన్హా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి, అగ్నిమాపకశాఖ, ఇతర సంబంధిత శాఖాధికారులతో కలిసి 44 షాపుల వద్ద భద్రతా ఏర్పాట్లు, అగ్ని నియంత్రణ పరికరాల లభ్యత వంటి అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ బాణసంచా విక్రయాలు పూర్తిగా ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా జరగాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని విక్రేతలకు స్పష్టం చేశారు. ఆయన వెంట అనకాపల్లి ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ, పట్టణ సీఐ ప్రేమ్ కుమార్, ఎస్ఐ సంతోశ్‌కుమార్ ఉన్నారు.

ఆహ్లాదాన్ని పంచే నగర వనాలు

నర్సీపట్నం ఆరిలోవ ధన్వంతరి వనంలో, ఎలమంచిలి నియోజకవర్గం యర్రవరం వద్ద వేమగిరిలో ఏర్పాటుకు సన్నాహాలు

- తొలి విడతగా ఒక్కొక్కదానికి రూ.1.15 కోట్లు మంజూరు
- పరిపాలనా అనుమతులు ఇచ్చిన కూటమి ప్రభుత్వం
- పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నదే అటవీ శాఖ లక్ష్యం
- వాకింగ్ పాత్, చెక్కవంతెన, ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు



కశింకోట మండలం బయ్యవరం వద్ద ఏర్పాటు చేసిన నగర వనం



ఆరిలోవ ధన్వంతరి వనాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ రేంజ్ అధికారి

నర్సీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణం అందించడానికి నగర వనాలు అందుబాటులోకి రాబోతున్నాయి. జిల్లాలో కశింకోట మండలం బయ్యవరంలో జాతీయ రహదారిని ఆనుకొని శారదా వనం పేరుతో నగర వనం ఏర్పాటు చేశారు. 2016-17లో కేంద్ర ప్రభుత్వం నగర వనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. తాజాగా నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలం ఆరిలోవ అటవీ ప్రాంతంలోని ధన్వంతరి వనం ఒకటి, ఎలమంచిలి నియోజకవర్గం యర్రవరం వద్ద వేమగిరి అటవీ ప్రాంతంలో నగర వనాలు ఏర్పాటు చేయడానికి కూటమి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఒక్కొక్క నగర వనం ఏర్పాటు చేయడానికి రూ.2 కోట్లు చొప్పున ఖర్చు అవుతుందని అటవీ అధికారులు ప్రతిపాదనలు పంపారు. మొదటి విడతగా రూ.1.15 కోట్లు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. పట్టణ ప్రాంత ప్రజలు సేద తీరేందుకు ఆహ్లాదకరమైన సుందర హరిత వనాలను ఏర్పాటు చేసి, పర్యావరణంపై అవగాహన పెంచడానికి నగర వనాలు ఏర్పాటు చేయాలని అటవీశాఖ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. పట్టణ ప్రాంతాలకు దగ్గరలో అటవీ ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా నర్సీపట్నం, ఎలమంచిలి పురపాలక సంఘాలకు దగ్గరలో ఉన్న అరిలోవ, వేమగిరి అటవీ ప్రాంతాలను ఎంపిక చేశారు.

నగర వనాల్లో ఏముంటాయంటే..

నగర వనాలలో కొండ పైకి ట్రెక్కింగ్‌కి వెళ్లేందుకు ఏర్పాటు చేస్తారు, పిల్లలు ఆడుకోవడానికి పార్కు ఏర్పాటు చేస్తారు. వాకింగ్ ట్రాక్, యోగ, ధ్యాన మందిరాలు, క్యాంటీన్ ఏర్పాటు చేస్తారు. చెక్కతో పగోడాలు నిర్మిస్తారు. చెక్క భవంతిని నిర్మించి అటవీ సిబ్బందితో పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేస్తారు. సేద తీరేందుకు చెక్క బెంచీలు, తాగునీరు, కుర్చీలు సమకూర్చుతారు. ఆరిలోవ అటవీ ప్రాంతంలో మూడు పగోడాలు, ఉడెన్ పాత్ (చెక్క వంతెన), ట్రెక్కింగ్‌కి ఏర్పాటు చేస్తున్నామని నర్సీపట్నం రేంజ్ అధికారి కేవీరాజేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

కూటమి పాలనలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత
- పలు రహదారులకు శంకుస్థాపన



రాజగోపాలపురంలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధిని ఏకతాటిపై నడిపించడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని రాజగోపాలపురం నుంచి కందిపూడి, పాయకరావుపేట నుంచి మంగవరం, గుంటపల్లి నుంచి ఒడ్డిమెట్ట మీదుగా ఎన్‌హెచ్-16 రోడ్డుకు వెళ్లే రహదారుల నిర్మాణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. అలాగే గుంటపల్లిలో సుమారు రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని, సుమారు రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రాజగోపాలపురం నుంచి కందిపూడి వరకు నాబార్డు నిధులు సుమారు రూ.60 లక్షలతో 2.2 కిలోమీటర్ల రోడ్డును, గుంటపల్లి నుంచి ఎన్‌హెచ్-16 వరకు నాబార్డు నిధులు సుమారు రూ.85 లక్షలతో 2 కిలోమీటర్ల రోడ్డు, పాయకరావుపేట నుంచి మంగవరం రోడ్డు సుమారు కోటి రూపాయలతో 5 కిలోమీటర్ల రోడ్డును నిర్మిస్తున్నట్టు ఆమె తెలిపారు. పాయకరావుపేట పట్టణంలో త్వరలోనే అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామన్నారు. కూటమి పాలనలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయన్నారు. గత వైసీపీ పాలనలో కనీసం రోడ్లు, డ్రైనేజీలను కూడా నిర్మించలేదన్నారు. ఈ సందర్భంగా మహిళలు పలు సమస్యలను హోం మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలు, జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ, పీఆర్ ప్రాజెక్టు డీఈఈ కుమారరాజా, తహశీల్దార్ ఎస్.ఎ.మహేశ్వరరావు, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీవోలు నానిబాబు, శ్రీనువాసరావు, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో.. పీహెచ్‌సీల తనిఖీ

దేవరాపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు వేచలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి హైమావతి శనివారం తనిఖీ చేశారు. రోగుల వద్దకు వెళ్లి అందుతున్న సేవలపై ఆరా తీశారు. మందుల రికార్డులు సక్రమంగా ఉన్నదీ, లేనిది పరిశీలించారు. ఆమె వెంట వైద్యులు ప్రశాంత్, శకుంతల ఉన్నారు.

ఎలమంచిలి ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

ఆర్డీవో సమక్షంలో ప్రత్యేక సమావేశానికి హాజరై అభిప్రాయాలు వెల్లడించిన ఎంపీటీసీ సభ్యులు

- తదుపరి ప్రక్రియకు తేదీ ఖరారు కావలసి ఉంది
- అనకాపల్లి ఆర్డీవో ఆయేషా



మాట్లాడుతున్న ఆర్డీవో ఆయేషా, పక్కన సమావేశంలో పాల్గొన్న వైస్ ఎంపీపీలు రాజాన శేషు, ఎస్.ఉమ, ఎంపీటీసీ సభ్యులు బర్రె శివలక్ష్మి, నగిరెడ్డి అమ్మాజీ

ఎలమంచిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఎంపీపీపై జనసేన పార్టీ మెజారిటీ ఎంపీటీసీ సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్టు అనకాపల్లి ఆర్డీవో ఆయేషా తెలిపారు. శనివారం ఎలమంచిలి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అనకాపల్లి ఆర్డీవో ఆయేషా అధ్యక్షతన ఎంపీడీవో సమక్షంలో నలుగురు ఎంపీటీసీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్‌పై గత నెల 24న వైస్ ఎంపీపీలు రాజాన సూర్య చంద్రశేషగిరిరావు(శేషు), శిలపరశెట్టి ఉమ, ఎంపీటీసీ సభ్యులు నగిరెడ్డి అజీ, బర్రె శివలక్ష్మిలు సంతకాలు చేసి అనకాపల్లి ఆర్డీవోకు, ఎలమంచిలి ఇన్‌చార్జి ఎంపీడీవోకు అవిశ్వాస తీర్మానం నోటీసులను అందజేసిన సంగతి తెలిసిందే. అధికారులు పరిశీలన అనంతరం ఈ నెల 18న ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ఎంపీటీసీ సభ్యుల కు తగిన సమాచారం అందించారు. మండలంలో ఏడు ఎంపీటీసీ సెగ్మెంట్లకు గాను ఏటికొప్పాక-2 నగిరెడ్డి దేముడమ్మ మృతి చెందిన సంగతి తెలిసిందే. మిగిలిన ఆరుగురు ఎంపీటీసీలకు గాను నలుగురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మాన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇద్దరు వైస్ ఎంపీపీలు, ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు ఆర్డీవో తెలిపారు. నలుగురు ఎంపీటీసీలు ఎంపీపీ బోదెపు గోవింద్‌పై అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశంలో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టయిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం తదుపరి ప్రక్రియ తేదీ ఖరారు చేయవలసి ఉందన్నారు. కాగా జనసేన పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ రాజాన శేషు ఆధ్వర్యంలో శిలపరశెట్టి ఉమ, నగిరెడ్డి అమ్మాజీ, బర్రె శివలక్ష్మిలు అంతా కలిసి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో రాజాన శేషు ఎంపీపీ పదవికి లైన్ క్లియర్ అయినట్టయింది. ఈ ప్రత్యేక సమావేశంలో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ధనుంజయరావు, ఎస్ఐలు సావిత్రి, ఉపేంద్రతో పాటు పోలీసు సిబ్బంది భద్రత ఏర్పాట్లు చేశారు. ఎంపీడీవో కార్యాలయం బయట జనసేన పార్టీ శ్రేణులతో కోలాహలం నెలకొంది.

ఎస్ఏఎఫ్ ప్లాంటు నిర్మాణానికి ఎన్టీపీసీ టెండర్లు



పూడిమడక వద్ద ఎన్టీపీసీ నిర్మించబోయే గ్రీన్ హైడ్రోజన్ హబ్ నమూనా

అచ్యుతాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద నిర్మించబోయే గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లో సస్టైయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (ఎస్ఏఎఫ్) ప్లాంటు నిర్మాణానికి ఎన్టీపీసీ టెండర్లను ఆహ్వానించింది. సుమారు 1200 ఎకరాల్లో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ జనవరి ఎనిమిదిన వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఇక్కడ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, పవన్ విద్యుత్‌తో పాటు సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. ఇదే ప్రాంగణంలో ఏడాదికి 1800 టన్నుల ఎస్ఏఎఫ్ తయారుచేసే ప్లాంటును కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి డిజైనింగ్, డెవలప్‌మెంట్ విధానంలో స్వదేశీ బిడ్డర్లు ఈ నెల 27వ తేదీ నాటికి టెండర్లను సమర్పించాలని ప్రకటన విడుదల చేసింది. నవంబరు 6న బిడ్డింగ్ ఖరారు చేస్తారు.



పాయకరావుపేటలో వర్షం

పేటలో భారీ వర్షం

పాయకరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన మార్పులతో శనివారం రాత్రి పాయకరావుపేటలో భారీ వర్షం పడింది. సుమారు గంటపాటు పడిన వర్షానికి పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయంకాగా, కాలువల్లో మురికినీరు వర్షపునీరు కలిసి రోడ్డుపైకి చేరడంతో ప్రజలు మురికినీటిలోనే రాకపోకలు సాగించారు.

మెయిన్ రోడ్డులోని పలుచోట్ల చెరువులను తలపించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇక పట్టణంలో వీధిలైట్లు వెలగని కారణంగా చీకట్లో రోడ్డుపై ఎక్కడ గోతులున్నాయో తెలియక పలువురు వాహనదారులు గోతుల్లో పడి గాయాలపాలయ్యారు.



మాడుగులలో వర్షం

మాడుగులలో..

మాడుగుల రూరల్: మండల కేంద్రం మాడుగులలో శనివారం రాత్రి జోరువాన కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం పొడిగానే ఉంది. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. చిరుజల్లులతో ఆరంభమై క్రమేపీ ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం పడింది. రోడ్డుపై వర్షపు నీరు పారింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

బొగ్గు లారీ బోల్తా

- లంకెలపాలెం జంక్షన్‌లో ఘటన
- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు
- వాహనాల రాకపోకలకు ఆటంకం



బోల్తా పడిన బొగ్గు లారీని క్రేన్ సహాయంతో పక్కకు తొలగిస్తున్న దృశ్యం

పరవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ మండలం పాలవలస వద్ద గల హిందుజా పవర్ ప్లాంట్‌కు గంగవరం పోర్టు నుంచి బొగ్గు లోడుతో బయలుదేరిన లారీ శుక్రవారం అర్ధరాత్రి లంకెలపాలెం జంక్షన్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో అటుగా వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాదం కారణంగా కొంత బొగ్గు రహదారి మధ్యలో పడిపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. దీనికి తోడు బొగ్గు పడి రహదారి చిందరవందరగా తయారవ్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని క్రేన్ సహాయంతో లారీని రహదారి పైనుంచి పక్కకు తొలగించారు. కాగా ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

▸ టీడీపీ నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు



సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు

ఎలమంచిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం పార్టీ సమన్వయక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణల వల్ల అన్నిరకాల వస్తువుల ధరలు అందుబాటులోకి వస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్నాథం, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం నియోజకవర్గంలో 25మందికి సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయడంతో పాటు సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పోస్టర్లను ప్రదర్శించారు. నాయకులు డొక్కా నాగభూషణం, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గెంజి శ్రీను, గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, పీలా తులసీరామ్, పెంటకోట విజయ్, కరణం రవి, బొద్దపు శ్రీనివాసరావు, దంట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీలో సంస్కరణలపై అవగాహన ర్యాలీ

ఎలమంచిలి : పట్టణంలో ఈపీడీసీఎల్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం జీఎస్టీ సంస్కరణలు, సూర్యఘర్ పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ వల్ల అన్నిరకాల వస్తువుల ధరలు తగ్గాయని సదరు అధికారులు, సిబ్బంది వివరించారు. సూర్యఘర్ పథకం వల్ల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

'బ్రాండిక్స్ ప్రగతికి సిబ్బంది మూలస్తంభాలు'



సిబ్బందికి బహుమతులను అందజేస్తున్న దొరస్వామి

అచ్యుతాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బ్రాండిక్స్ ప్రగతికి సిబ్బంది మూలస్తంభాల వంటివారని సంస్థ భారత భాగస్వామి దొరస్వామి అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని శనివారం కర్మాగారంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 14వేల మంది సిబ్బందికి బహుమతులు అందజేసి మాట్లాడారు. సిబ్బంది నిబద్ధతకు గుర్తింపుగా బహుమతు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యాభై శాతం అదనపు టారిఫ్ విధింపుల నేపథ్యంలో సంస్థ కష్టకాలంలో ఉన్నప్పటికీ సిబ్బందిలో మానసిక స్థైర్యాన్ని నింపేలా ఈ బహుమతులు అందిస్తున్నట్టు చెప్పారు. దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రణాళికా బద్ధంగా మునిసిపాలిటీ అభివృద్ధి

▸ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ▸ చెత్త సేకరణ అంశంలో వాగ్వాదం ▸ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చిన సభ్యులు





సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, చిత్రంలో చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పథాన నిలుపుదామని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితోనే ఏదైనా సాధ్యమన్నారు. మునిసిపాలిటీలో కొంత మంది భవన నిర్మాణాలు తమ ఇష్టానుసారంగా చేపడుతున్నా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు సభ్యులు సభ ముందుంచారు. పారిశుధ్య కార్మికుల నియామకం చేపట్టా లని వైస్ చైర్మన్ గుప్తా కోరారు. దీనిపై ఎమ్మెల్యే కల్పించుకుని మీవార్డులో రోజుకు ఎంతచెత్త సేకరణ జరుగుతుందో తెలిపాలన్నారు. మునిసిపాలిటీలో చెత్త సేకరణకు సంబంధించి ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ రమాకుమారిల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అన్ని వార్డులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేద్దామని ఎమ్మెల్యే అనడంతో సద్దుమణిగింది. అనంతరం పాలకవర్గ సభ్యులు వార్డుల్లో నెలకొన్న సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. చివరిగా పలు అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అరెపు గుప్తా, కౌన్సిలర్లతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మునిసిపల్ కార్యాలయం ఆవరణలో మూడో అంతస్తుపై కౌన్సిల్ సమావేశహాలు నిర్మాణానికి ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ శంకుస్థాపన చేశారు. కమిషనర్ ప్రసాదరాజు, కూటమి నేతలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు

ఎలమంచిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమస్యలపై మునిసిపల్ పారిశుధ్య కార్మికులు శనివారం కమిషనర్ ప్రసాదరాజుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పెరిగిన జనాభా ప్రాతిపదికన సిబ్బందిని పెంచాలని, పర్మినెంట్ ఉద్యోగుల వలే ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 62 సంవత్సరాల సర్వీసును పెంచాలన్న డిమాండ్లపై గత ప్రభుత్వంలో అంగీకారం కుదిరినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ఇందుకు నిరసనగా సమ్మె నోటీసు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

'విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి'



నృత్యాలతో అలరిస్తున్న కళాశాల విద్యార్థినులు

అచ్యుతాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తు నిర్ణయించేంది విద్యార్థి దశేనని, ఈ తరుణంలో ప్రతిఒక్కరూ చక్కగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. ఇక్కడి అచ్యుత డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డేలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పారిశ్రామికంగా అచ్యుతాపురం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఐటీ కంపెనీలు కూడా వచ్చే అవకాశం ఉన్నందున అంతా లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, ప్రిన్సిపాల్ రాజాన సత్యనారాయణ, డైరెక్టర్ పల్లి అశోక్, నాయకులు కూంద్రపు వెంకు

ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు



రాంబిల్లిలో బాలికల జట్ల మధ్య సాగుతున్న కబడ్డీ పోటీ

మునగపాక, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజులు నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు శనివారంతో ముగిశాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, షటిల్, యోగా, అథ్లెటిక్ పోటీలు నిర్వహించడంతో వారంతా ఉత్సాహంగా తలపడ్డారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, కూటమి నాయకులు దాడి ముసిలినాయుడు, పెంటకోట విజయ్, టెక్కలి పరశురాం, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు, పెంటకోట శ్రీరామ్మూర్తి, ఆడారి లక్ష్మణరావు, ఆడారి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో...

రాంబిల్లి : మండల కేంద్రం రాంబిల్లి హైస్కూల్ ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీల శనివారం ముగియి. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా తలపడ్డారు. ప్రతిభ చూపిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయికి అర్హత సాధించారు. ఎంఈవోలు ఎం. సూర్యారావు, సూర్యనారాయణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఖగేష్‌లతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాంబిల్లిలో సచివాలయం వద్ద మొక్క నాటుతున్న తహశీల్దార్, ఎంపీడీవో

పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ

'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'లో వివిధ శాఖల అధికారులు

రాంబిల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయ మాధవి అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాంబిల్లిలో హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం సచివాలయం భవనం వద్ద మొక్కలు నాటారు. ఈవోపీఆర్‌డీ రాజు, ఆర్ఐ రవికుమార్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాకలో...

మునగపాక : మండల కేంద్రం మునగపాకలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.ఉషారాణి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రసాద్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



మునగపాకలో ర్యాలీలో నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం/ రూరల్ , అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొండకర్లలో అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి కమిటీ సభ్యుల సత్కరించారు. ఈ వేడుకల్లో కూటమి నాయకులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ భాషా పరిజ్ఞాన పోటీలు



చిన్నారులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చినదొడ్డిగల్లు హైస్కూల్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్లక్లబ్ వ్యవస్థాపకుడు వై.వెంకట రమణ మాస్టారు చిన్నారులకు శనివారం ఇంగ్లీష్ పరిజ్ఞాన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ 20 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన 100 మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆంగ్లభాషపై పిల్లలకు ఉత్సాహం, శ్రద్ధ కలిగేలా కథలు చెప్పడం, హ్యాండ్ రైటింగ్, పద్యపఠనం, చదవడం, వ్యాసరచన, వక్తృత్వం, తదితర విభాగాలకు సంబంధించి పోటీలు నిర్వహించారు. తన సొంత నిధులతో కొనుగోలు చేసిన బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయుడు వైవీ రమణ చేస్తున్న సేవలను ఎంఈవో- 2 నాగన్నదొర, పెదబోదిగల్లం హైస్కూల్ హెచ్‌ఎం జయశ్రీ, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వీ బాలాజీ, రమణయ్యపేట హెచ్‌ఎం చినతల్లి, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఎస్.ఫాల్గుణరావు, నానాజీ, పాల్గొన్నారు.

నేడు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు రవీంద్రన్, ప్రముఖ ప్రవచన కర్త 'చాగంటి' రాక

పాయకరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ధన్వంతరి జయంతి కార్యక్రమానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కన్నాలయం గోపాలన్ ర వీంద్రన్‌తోపాటు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు హాజరుకానున్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు సీహెచ్‌వీకే.నరసింహారావు ఈ మేరకు వివరాలందించారు. ఆదివారం ధన్వంతరి జయంతి పురస్కరించుకుని స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో ఉన్న ఆయుర్వేద ఆసపత్రిలో ధన్వంతరి హోమం నిర్వహిస్తున్నామన్నారు. విష్ణు సహస్రనామ పారా యణం ఉంటుందని వివరించారు.

సూపర్ జీఎస్టీతో తగ్గిన సోలార్ సూర్య ఘర్ ధర



ప్రచారం చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

పాయకరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీతో సోలార్ సూర్య ఘర్ పథకం పరికాల ధర తగ్గినట్టు ఏపీఈపీడీసీఎల్ పాయకరావుపేట డీఈఈ వైవీ లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ కేంద్రం సూపర్ జీఎస్టీ అమలుతో సోలార్ యూనిట్‌పై జీఎస్టీ 12 నుంచి ఐదు శాతానికి తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్‌లు సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎస్.సత్య నా రాయణ, నాగేశ్వరరావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రధాన లక్ష్యం: హోం మంత్రి అనిత

కోటవురట్ల, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి అధికప్రాధాన్యం ఇస్తోందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం మండలం లింగాపురం, నీలిగుంట, అన్నవరం గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లింగాపురంజంక్షన్ నుంచి కె. వెంకటాపురం వెళ్లే రోడ్డుకు రూ. కోటి రూపాయలతో చేపట్టనున్నారు. ఎల్‌వీకే రోడ్డునుంచి జి.సిన్యాసిరాజుపాలెం మీదగా నీలిగుంట వెళ్ళే రహదారికి రూ.1.45కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు ఆమె తెలిపారు. అలాగే యండపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అన్నవరం మీదగా నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామానికి వెళ్లే రహదారిక రూ.1.35 కోట్లతో చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల అధ్యక్షులు పెట్ల లింగంనాయుడు, జానకిశ్రీనివాసరావు, యండపల్లి చంటి, వేచలపు భాస్కరరావు, సుంకర్‌బాబ్జీ, తిరుమలరావు, సూర్యారావు, కోటి తదితరులు పాల్గొన్నారు.



అన్నవరం రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వంగలపూడిఅనిత

విద్యార్థి కుటుంబ సభ్యులకు పరామర్శ

పాయకరావుపేట రూరల్: ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందిన హేమన్ రాజు కుటుంబ సభ్యులను శనివారం హోం మంత్రి అనిత పరామర్శించి ఓదార్చారు. మండలంలోని వెంకటనగరానికి హేమన్‌రాజు పెద్దాపురంలో ఆదిత్య కాలేజీలో ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు. ఈ క్రమంలో కాలేజీకి వెళ్లే ప్రయత్నంలో రైలు ఎక్కుతూ పడిపోయి దుర్మరణం చెందాడు. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత హేమన్‌రాజు తల్లిదండ్రులను పరామర్శించి ఓ దార్చారు. కుటుంబాన్ని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్ వంకా వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ వంకా స త్యనారాయణ, టీడీపీ నాయకులు చింతలపు ప్రదీప్, పెదిరెడ్డి చిట్టిబాబు, శివ, హరి, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన అండర్-17 బాలికల జట్టు

పాయకరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు రెండో రోజు శనివారం హోరా హోరీగా సాగాయి. వాలీబాల్, కబ డ్డీ, ఖోఖో, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో 13 పాఠ శాలలకు చెంది 260 మంది బాలి కలు పాల్గొన్నారు. క్రీడల మండల కో- ఆర్డినేటర్ వైడీ.శ్యామ్ కుమార్, ఎంఈఓ-2 జి.రమేశ్ బాబుతోపాటు జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, హెచ్ఎం డీఎల్.భవానీ, పీఈటీ లు పాల్గొన్నారు.

ఎస్. రాయవరం: మండలంలోని కొరుప్రోలు జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం కప్పల ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు అమ్మోరయ్య ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. వాలీబాల్ అండర్ 17లో మొదటి స్థానం వమ్మవరం పాఠశాలకు చెందిన బాలురు, ద్వితీయ స్థానం దార్లపూడి బాలురు నిలిచారు. వాలీబాల్ అండర్ 14లో మొదటి స్థానం కొరుప్రోలు, ద్వితీయ స్థానం ఎస్. రాయవరం, కబడ్డీ అండర్ 17లో మొదటి స్థానం నారాయణపట్నం, ద్వితీయ స్థా నం దార్లపూడి, ఖోఖో లో మొదటి స్థానం పెదఉప్పలం, ద్వితీయ స్థానంలో కొరుప్రోలుకు బాలురు నిలిచారు.

సామూహిక సీమంతాలు



సీమంతాల్లో పాల్గొన్న అధికారులు

ఎస్. రాయవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ పలు గ్రామాల గర్భిణులకు శనివారం ఘనంగా సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మీనాకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం ముఖ్య అతిథులుగా పాల్గొని గర్భిణులను ఆశీర్వదించారు. పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో కర్రి శ్రీరామమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో రాజయ్యపేట

▸ గ్రామానికి వచ్చే వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు

▸ బల్క్‌డ్రగ్ పార్కు విషయంలో బయట వ్యక్తులు రెచ్చగొడుతున్నారన్న సమాచారంతో చర్యలు



బైక్‌పై రాజయ్యపేట వెళ్తున్న వారిని సోదా చేస్తున్న పోలీసులు

నక్కపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజయ్యపేట మత్స్యకార గ్రామం గత ఐదు రోజులుగా పోలీసుల నిఘా నీడలో ఉంది. బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ ఆందోళన చేస్తున్న మత్స్యకారులు ఈ నెల 12న నక్కపల్లి హైవేపైకి వెళ్లి దాదాపు 4 గంటల పాటు హైవేను దిగ్బంధించడం పోలీస్‌శాఖను కలవరపెట్టింది. ఈ విషయమై రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో రాజయ్యపేట సహా చుట్టుపక్కల గ్రామాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బయట వ్యక్తులు కొందరు వచ్చి మత్స్యకారులను రెచ్చగొడుతున్నారని, అందు వలనే హైవేను ముట్టడించారని జిల్లా పోలీస్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బయట వ్యక్తులు రాజయ్యపేట రావాలంటే ముందుగా అనుమతులు తీసుకోవాలని షరతు పెట్టారు. ఆటోలు, బైక్‌లపై రాజయ్యపేట గ్రామంలోకి వెళుతున్న వారిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆఖరికి ఆన్‌లైన్ ఆర్డర్లను ఇవ్వడానికి వచ్చే ఏజెంట్లను సైతం ఆరా తీస్తున్నారు. కాగా బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ రాజయ్యపేట కేంద్రంగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళన శనివారం నాటికి 35వ రోజుకు చేరుకుంది.

బల్క్‌డ్రగ్ పోరాటానికి మద్దతు

-సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నక్కపల్లి: బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలంటూ మండలంలో మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. శనివారం విశాఖలో ఆయనను బల్క్‌డ్రగ్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు సీపీఎం నేత అప్పలరాజుతో కలిసి కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎం సెంట్రల్ కమిటీ సభ్యుడు కె.లోకనాథం, ఆర్.శంకరరావు, ఎం.రాజేశ్, మహేశ్‌బాబు ఉన్నారు.

ఆలయాలకు పూజా కిట్లు పంపిణీ



కుమారపురంలో పూజ కిట్లను అందిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దానధర్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాయకరావుపేట, నక్కపల్లి, మాడుగుల, తుని, తదితర మండలాల్లోని ఆలయాలకు కార్తీక మాసంలో దీపారాధన, ఇతర పూజలకు అవసరమైన కిట్లను శనివారం దానధర్మ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు నీలాపు వెంకటరెడ్డి, కట్టా వీరబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో మండలంలో 15 దేవాలయాలకు ఈ పూజా కిట్లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ రాజు, శ్రీమన్నారాయణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల చెరువుల పరిశీలన

నక్కపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునూడిపూడి గ్రామంలో శనివారం రొయ్యల చెరువులను ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో కె.చలపతిరావు పరిశీలించారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో అన్ని నిబంధనలు యాజమాన్యాలు పాటించాలని సూచించారు. పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులను చెల్లించాలని కోరారు. అనంతరం రైతులతో మాట్లాడారు. నక్కపల్లి సంపద కేంద్రాన్ని తనిఖీ చేసి మొక్కలు నాటారు.

శిథిల తుఫాన్ రక్షిత భవనం తొలగింపు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనగరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న శిథిల తుఫాను రక్షిత భవనాన్ని ఎట్టకేలకు కూల్చడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. శనివారం తహశీల్దార్ ఎస్.ఎ. మహేశ్వరరావు ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. సర్పంచ్ వంకా వెంకటరమణ, శివ, హరి, కార్యదర్శి వై.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.ప

ఘనంగా 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'

ఎస్. రాయవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం రామయ్యపట్నంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మీనాకుమారి మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని మెరుగు పరచాలని సూచించారు. పెట్టుగోళ్ళపల్లిలో సర్పంచ్ అల్లు వెంకట ప్రశాంతి స్థానిక నాయకులతో కలిసి డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్యకు పరిష్కారం లేదా?

... 7వ పేజీ తరువాయి

పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా కనీసం డంపింగ్ యార్డుకు స్థలాన్వేషణ కూడా జరగడం లేదు. జీవీఎంసీ, రెవెన్యూ అధికారులకు డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని ఎంపిక చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశించినా అధికారులు మాత్రం స్థలాన్ని కేటాయించే ప్రయత్నాలు చేయడం లేదు. దీంతో డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం దొరుకుతుందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'ఆర్ఐలు ప్రభుత్వ భూములను పరిరక్షించాలి'



ఆర్ఐలకు మోటార్ సైకిళ్లుఅందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా రక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై ఉందని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లాలోని 26 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు మోటారు సైకిళ్లను ఆమె అందజేసి మాట్లాడారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విధులను దృష్టిలో ఉంచుకొని వారు క్షేత్రస్థాయిలో పర్యటనలకు ఏఎంఎన్ఎస్ ఇండియా కంపెనీ సీఎస్ఆర్ నిధులతో ఈ మోటారు సైకిళ్లను సమకూర్చినట్టు చెప్పారు. ఈ వాహనాలను వినియోగించుకొని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించి ప్రభుత్వ భూములను రక్షించాలని సూచించారు. ప్రతి వారం కనీసం రెండు గ్రామాల్లో పర్యటించి 22 (ఏ) భూములను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, పరిపాలనాధికారి విజయకుమార్, తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిని వైసీపీ నేతలు కళ్లు తెరచి చూడాలి : బుద్ద



తుమ్మపాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పటంలో విశాఖ ప్రత్యేక గుర్తింపు సాధిస్తుండడం ఆనందదాయకమని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం ఆయన అనకాపల్లిలో మాట్లాడుతూ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇప్పటికైనా కళ్లు తెరిచి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. గూగుల్ ఏఐ సెంటర్ల వల్ల ఉద్యోగాలు రావని దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్ పేరును ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు అని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధిని ఓర్వలేక వైసీపీ అధినేత జగన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని అంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

కిడ్నీ వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక వైద్య శిబిరం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యాలయంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డయాలసిస్ యూనిట్ ఇన్‌చార్జి వీరరాజు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 50 మంది వరకు హాజరై వైద్య సేవలు పొందారు. అలాగే, గతంలో నిర్వహించిన శిబిరానికి హాజరుకాని వారిని గుర్తించి తీసుకువచ్చి దగ్గరుండి వైద్యం చేయించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ సబీనా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావుతో పాటు తాడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

పరిశుభ్రతే ఆరోగ్యానికి చిట్కా

▸▸ 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'లో కలెక్టర్ విజయ కృష్ణన్ ▸▸ కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయాల ఆవరణలో చెత్తాచెదారం తొలగింపు



కలెక్టరేట్ ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రతలో కలెక్టర్, డీఆర్వో

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం కేటాయించాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం స్వచ్ఛమైన గాలి అవసరమని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రజా రవాణా వాహనాలను ఉపయోగించడం, విరివిగా మొక్కలు నాటడం, సోలార్ విద్యుత్ వినియోగం వంటి పద్ధతులను ప్రతి ఒక్కరూ ఆచరించి వంటి వాటితో పాటు ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో...

జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యాలయ ప్రాంగణంలో పిచ్చి మొక్కలను, వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ దేవ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ కార్యాలయాల్లో వారంలో ఒకరోజు పరిసరాల పరిశుభ్రత చేపట్టాలన్నారు. వర్షా కాలంలో ప్రజలు తప్పనిసరిగా కాచి వడబోసిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు లక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో...

జీఎస్టీ సంస్కరణలపై ఘనంగా సంబరాలు



వేడుకలను ప్రారంభిస్తున్న జేసీ జాహ్నవి, చిత్రంలో ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణల ద్వారా వస్తువుల ధరలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. శనివారం రాత్రి అనకాపల్లిలో జీఎస్టీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్డు అంతటా విద్యుద్దీపాలంకరణలు, స్వాగత ద్వారాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద జీఎస్టీ సంబరాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో జేసీ జాహ్నవి ప్రారంభించారు. దారి పొడవునా నవదుర్గల వేషధారణలు, కోలాటాలు తదితరాలతో ఈ ప్రాంతం సందడిగా మారింది. చిన నాలుగురోడ్ల జంక్షన్‌లో జీవీఎంసీ అధికారులు సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై ఏర్పాటు చేసిన ముగ్గులతో అక్షరమాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎన్టీఆర్ జంక్షన్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై మండలాలు, గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో వస్తువుల ధరలు తగ్గి ప్రజలకు మేలు జరిగిందన్నారు. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, వినియోగదారులు ఇద్దరికీ లాభదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల ఆర్థికభారాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం తీసు కోవడం ప్రశంసనీయమ న్నారు. స్థానిక వ్యాపారులు, వాణిజ్య సంస్థలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఉత్ప త్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. జేసీతో పాటు కొణతాల, ఆర్డీవో షేక్ ఆయీషా, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, టీపీవో వరప్రసాద్, మెప్మా ఏడీపీ వై.సంతోష్‌కుమార్, జీవీఎంసీ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



బైక్ నడుపుతున్న ఎమ్మెల్యే

మద్యం మత్తులో ఉరివేసుకుని ఆత్మహత్య

కొత్తూరు, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలివి. మాకవరం గ్రామానికి చెందిన అనసూరి రమణ (42) తుమ్మపాల వద్ద టైర్ల షాపులో పని చేస్తుండేవాడు గత కొద్ది కాలంగా మద్యం మత్తుకు బానిసై భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. దీంతో ఆమె రాయుడుపేటలో గల పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రమణ సోదరి తనకు రోజూ భోజనం తీసుకువచ్చి ఇస్తూ ఉండేది. ఇదే క్రమంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో భోజనం తీసుకువచ్చే సరికి ఇంట్లో శ్లాబ్ హుక్కుకు ఉరివేసుకుని రమణ కనిపించడంతో ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. ఈ మేరకు మృతుడు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

మెట్ల పైనుంచి జారిపడి ఒకరి మృతి

పరవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇంటి మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారడంతో కింద పడి ఒకరు మృతి చెందారు. దీనికి సంబంధించి పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ కామత్(42) స్థానిక ఇండస్ట్రియల్ పార్కులోని ఒక స్టీల్ పరిశ్రమలో వర్కుషాపు ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి గౌతలచ్చన్ననగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. ఈ క్రమంలో రాజ్‌కుమార్ కామత్ మద్యం సేవించి తాము ఉంటున్న మొదటి అంతస్తుకు వెళుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి వెనుకకు పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి స్నేహితులు శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఈ ప్రమాదాన్ని గమనించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొత్తూరు, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామ సమీప జాతీయ రహదారిపై వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుందని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ ప్రమాదంపై వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచామన్నారు. ఆచూకీ తెలిసినవారు రూరల్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.



బాలికలు ఆత్మస్థైర్యం పెంచుకోవాలి

▸▸ జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారిణి సూర్యలక్ష్మి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలికలు ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారిణి సూర్యలక్ష్మి అన్నారు. పట్టణ జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవ ముగింపోత్సవంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రధానంగా విద్యార్థినులు చదువుపై దృష్టి సారించాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండి, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ బాలికలు లక్ష్యంతో ముందడుగు వేస్తే ఉన్నత స్థాయికి చేరుకోగలరన్నారు. బాలికా దినోత్సవాల్లో భాగంగా బాలికలకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రుధిర రాణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పి.ప్రభావతి, ఏసీడీపీవో టి.శశికళ, వెంకటరమణ, రమణకుమారి, ఇందిర, మంగతాయారు, జాస్మిన్, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యలక్ష్మి



పాఠశాలలో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు

▸▸ 24 పాఠశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరు

తుమ్మపాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి మండలం తుమ్మపాలలో మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ఘనంగా జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో మండలం నలుమూలల నుంచి 24 పాఠశాలల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో ఉత్సాహంగా తలపడ్డారు. ప్రధానంగా ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ క్రీడల్లో గెలుపొందిన వారు త్వరలో జరగనున్న డివిజన్ స్థాయి క్రీడలకు అర్హత సాధిస్తారని తుమ్మపాల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పీలా వీరునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి బాబి, తట్టా పెంటయ్య నాయుడు, రాపేటి రామ్‌కుమార్, ఆడారి గోవిందరావు, పీలా తాతునాయుడు, బోసుబాబు, పెతకంశెట్టి బలరాం తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు

▸▸ ఎస్సీ రైల్వే విజయవాడ డివిజన్ ఎస్‌డీపీవో ప్రేమ్‌కుమార్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే రైల్వే శాఖ లక్ష్యమని ఎస్సీ రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ డీపీవో ప్రేమ్‌కుమార్ లకావత్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో అమృత సంవాదం అనే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ అమృతభారత్ పథకం ద్వారా పలు స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. అనకాపల్లి స్టేషన్‌లో ఆధునిక మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, దివ్యాంగులు, వృద్ధుల కోసం లిఫ్ట్, ఎస్కలేటర్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు కొణతాల అప్పలరాజు మాట్లాడుతూ ఎల్‌టీటీ, గోవా వెళ్లే రైళ్లకు అనకాపల్లిలో హాల్ట్ ఇవ్వాలన్నారు. అలాగే ప్రత్యేక రైళ్లకు కూడా హాల్ట్ కల్పించాలని కోరారు. మరో సభ్యుడు మాట్లాడుతూ అభివృద్ధి కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. గంగుపాం నాగేశ్వరరావు మాట్లాడుతూ గూడ్స్‌షెడ్డు వైపు ఉండే బుకింగ్ కౌంటరును తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మరో ప్రయాణికుడు మాట్లాడుతూ కాకినాడ పాసింజర్ రైలుకు బోగీలు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో స్టేషన్ మేనేజర్ సచ్చి నివాస్, సీసీఐ నవీన్‌కుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ నవీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్ లకావత్

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ పై ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

అనకాపల్లిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ర్యాలీని ఈపీడీసీఎల్ ఎస్ఈ రమణ, రవాణా శాఖ అధికారి మనోహర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. సుంకరమెట్ట జంక్షన్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ర్యాలీ సాగింది. పునరుత్పాదక శక్తి పరికరాలపై జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు, వాహనాల ధరల తగ్గింపుపై నినాదాలు చేశారు. ఈపీడీసీఎల్, రవాణా శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో వాడచీపురుపల్లి విద్యార్థి సత్తా

పరవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల తమిళనాడు రాష్ట్రం దిండుగళ్‌నగర్‌లో నిర్వహించిన 44వ సబ్ జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ చాం పియన్‌షిప్ పోటీల్లో వాడచీపురుపల్లి హైస్కూల్ విద్యార్థి పెదపూడి గంగాధర్ సత్తా చాటాడు. ద్వితీయ స్థానంలో నిలిచి జిల్లాకు పేరుప్రఖ్యాతులు తీసుకువచ్చాడని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్.వెంకటరావు, ఎన్.సన్యాసిరావు తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదరు విద్యార్థిని హెచ్ఎం ఎన్.శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు

సబ్బవరం/ పరవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, సీఐ రామచంద్రరావు హెచ్చరించారు. సబ్బవరం పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో పదిహేను బాణసంచా విక్రయ కేంద్రాలకు అనుమతులు ఇచ్చినట్టు చెప్పారు. ఇదిలావుంటే, దీపావళిని పురస్కరించుకొని పరవాడ మండలంలో బాణసంచా విక్రయాలకు 21 షాపులకు అనుమతులు ఇచ్చినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.

జమ్మాదులపాలెంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న టీడీపీ నేతలు

కశింకోట, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమ్మాదులపాలెం గ్రామంలో గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా టీడీపీ యువ నాయకుడు డాక్టర్ పీలా శ్రీకాంత్, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, పార్టీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, నాయకులు కాయల మురళీ, కలగ సోమేశ్వరరావు తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు ఒమ్మి కోటేశ్వరరావు, ఒమ్మి సత్యనారాయణలు వీరిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భారీ సాం స్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.




చెత్త డబ్బా సంచిలో వేస్తున్న దొన్నుదొర, నాయకులు


మాట్లాడుతున్న చింతపల్లి ఎంపీడీవో సీతామహాలక్ష్మి


హుకుంపేటలో ర్యాలీ

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగస్వాములు కావాలి

విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర

అరకులోయ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంధ్రా-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. శనివారం ఎంపీడీవో లవరాజు ఆధ్వర్యంలో అవగాన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దొన్నుదొర, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బొరిబొరి లక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంనుంచి నాలుగురోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దొన్నుదొర మాట్లాడుతూ అరకులోయ స్వచ్ఛమైన గాలి, అడవులతో నిండుకున్న ప్రాంతమన్నారు. ఈ సహజసిద్ధ ప్రకృతి అందాలను సందర్శించేందుకు పర్యాటకులు ఏటా వస్తుంటారన్నారు.అందువల్ల అరకును ప్లాస్టిక్, పాలథిన్ వాడకం నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. ఎంపీడీవో లవరాజు పరిసరాల పరి శుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. రహదారికి ఇరువైపులా చెత్తను, వాటర్, డ్రింక్‌బాటిల్స్‌ను నాయకులు, అధికారులు తొలగించి శుభ్రపరిచారు. అరకు జనసేన ఇన్‌చార్జి చిరంజీవి, బీజేపీ నేత, సాగర ఎంపీటీసీ సభ్యుబు దేవదాసు , టీడీపీ మండల అధ్యక్షుడు లకోయ్‌మహాదేవ్, రేంజర్ కోటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది సత్యసాయి సుబ్రహ్మణ్యం, వైస్ సర్పంచ్ చందూ విజయ నిర్మల, ఆశ్రమోన్నత పాఠశాల హెచ్‌ఎం. తెలగంజి నాగేశ్వరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్‌నాయక్ అధ్యక్షతన ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు అనితకుమారి, విజయలక్ష్మి, నాగబాబు స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

హుకుంపేట: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని హెల్త్ శాఖ డిప్యూటీ డీవో చెల్లయ్య అన్నారు. శనివారం హుకుంపేట, సోభకోట, అండిభ పంచాయతీల్లోని ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లలో చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించాను. పశువులు పాకలు ఇళ్ల ముందు లేకుండా చూసుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో ఎస్. సన్యాసిరావు, ఎంఈవో ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మ రమ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జి.మాడుగుల: పరిసరాలను పరిశు భ్రంగా ఉంచాలని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు సూచించారు. కె.కోడాల్లి పంచాయతీ బంద వీధి గ్రామంలో శనివారం ర్యాలీ చేపడుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తడి, పొడి చెత్త వేరువేరుగా వేయాలన్నారు. మూఢనమ్మకాలు విడనాడలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, సర్పంచ్ చిలకమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీలేరులో జెన్‌కో ఉద్యోగుల ర్యాలీ

సీలేరు: సీలేరులో శనివారం జెన్‌కో ఇంజనీర్లు, ఉద్యోగులు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర స్వర్ణ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంజనీర్లు, ఉద్యోగులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కల నాటడం, సోలార్ విద్యుత్ వాడకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ స్టాఫ్, విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

చింతపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రజలు ముందుకు రావాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛ దివాస్‌లో భాగంగా స్వచ్ఛమైన గాలి అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత బస్ స్టాండ్‌లో మానవహారం చేపట్టారు. జీసీసీ ఉద్యోగులు డివిజన్, బ్రాంచి కార్యాలయాల పరిసరాల్లోని జంగిల్ తొలగించి శుభ్రం చేసుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, కూటమి నాయకులు రీమల ఆనందరావు, లక్కోజు భూషణం, డీఆర్‌వో వెంకటరాజు, కార్యదర్శి ముక్కలి వెంకటరావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక పీహెచ్‌సీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు.

కుంటిమామిడికి పక్కా రహదారి నిర్మించాలి


నిరసన తెలుపుతున్న గ్రామస్థులు, జీఎస్‌యూ నాయకులు

పెదబయలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి పక్కా రహదారి నిర్మించాలని డిమాండ్ చేస్తూ మండలం బొంగరం పంచాయతీ కుంటిమామిడికి చెందిన గిరిజనులు జీఎస్‌యూ నేతల ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. వర్షాకాలంలో ఇక్కట్లు తప్పటం లేదని తెలిపారు. ఇక్కడ ఉన్న ఎంతో ప్రసిద్ధి గాంచిన రాచకొండచెల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. బురద రోడ్డుపై నిత్యం నడుచుకుంటూ విద్యార్థులు బొంగరం పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. అధికారులు స్పందించి గ్రామానికి పక్కా రహదారి నిర్మించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు బూడిదే మాధవరావు, మణుగూరు బాబూజీ, గ్రామస్థులు తల్లే రమేశ్, ఎ. ముత్యాల నాయుడు, సత్తిబాబు, నాగేశ్వరరావు, జయబాబు, రామలింగం తదితరులు డిమాండ్ చేశారు.

25 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయితో ముగ్గురు నిందితులు

డుంబ్రిగుడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా పాఠశాల జంక్షన్ వద్ద శనివారం 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ పాపినాయుడు అందించిన వివరాలివి... వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిశా వైపునుంచి ఆటోలో తరలిస్తున్న 25 కేజీల గంజాయిని గుర్తించారు. దీనిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులో తీసుకున్నామన్నారు. నిందితుల్లో ఒకరిది ఒడిశా కాగా, ఇద్దరు ముంచంగిపుట్టు మండలం వాసులుగా గుర్తించమన్నారు.

విద్యార్థినికి అభినందన


పరుగు పందెంలో పతకం సాధించిన చిన్నారిని సన్మానిస్తున్న దృశ్యం

అరకులోయ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారదా నికేతన్‌లో మూడో తరగతి చదువుతున్న కొర్ర జీవన్ తానియా విశాఖపట్నం గీతం కళాశాల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 10కిలోమీటర్ల మారథాన్‌లో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ నేపథ్యంలో తానియాను ప్రిన్సిపాల్ ఎస్.చిరంజీవి అధ్యక్షతన శనివారం అభినందించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు, రాష్ట్ర గిరిజన సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పాల్గొని చిన్నారి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. సీఐటీయూ నేత ఉమామహేశ్వరరావు , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వైసీపీ విమర్శలు సరికావు'


మాట్లాడుతున్న కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు

డుంబ్రిగుడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే. వైసీపీ ఓర్వలేక అడ్డగోలు విమర్శలకు దిగుతోందని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు అన్నారు. స్థానిక కిడారి సామాజిక భవనంలో విలేకరులతో మాట్లాడారు. 16 నెలల కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తుందన్నారు. అయినా, వైసీపీ కోటి సంతకాల సేకరణ పేరిట కార్యక్రమంచేపట్టడం సిగ్గుచేటుగా ఉందన్నారు. అసెంబ్లీకు వెళ్లకుండా వైసీపీ ఎమ్మెల్యేలు జీతభత్యాలు తీసుకుంటున్నందుకా... కోటీ సంతకాల సేకరణ అని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గీత, మాజీ ఎంపీపీ దన్నేరావు, టీఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి స్వామి, నాయకులు భాస్కరరావు, బీమరాజు, పెసా కమిటీ అధ్యక్షులు సింహాద్రి, సీతన్న తదతరులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి'


గంగులయ్యకు సత్కారిస్తున్న జనసేన నాయకులు

కొయ్యూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థ గత ఎన్నికలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జనసేన నేత, జానపద, సృజనాత్మక ఆకాడమి చైర్మన్ వి.గంగులయ్య చెప్పారు. మండల కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనను సత్కరించారు. పార్టీ నిర్మాణం, రాజకీయ సమీకరణాలపై గంగులయ్య స్థానిక నాయకులను అడిగితెలుసుకున్నారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నివేదికలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, బుజ్జిబాబు, రాంప్రసాద్, శేషుబాబు, రాజబాబు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో పాఠశాల భవన నిర్మాణం


పాఠశాల నిర్మాణానికి శ్రమదానంతో కృషి చేస్తున్న గ్రామస్తులు.

పెదబయలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూరుమూల గోమంగి పంచాయితీ వన్నాడ గ్రామంలోని ట్రైబల్ వెల్ఫర్ పాఠశాల భవనాన్ని గ్రామస్థులు తమ సొంత నిధులతో అభివృద్ధి చేశారు. గత వైసీపీ పాలనలో నాడు- నేడు కింద రూ. 16 లక్షలు నిధులు మంజూరైనా రూ. 4 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. ఈ స్థితిలో రెండు భవనాలు, బోరు నిర్మించారు . అనంతరం మిగిలిన నిధులు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో ఇంటికి రూ. 1000 చొప్పున రూ. 50వేలు, గ్రామ యువత రూ. 7,100, పాఠశాల ఉపాధ్యాయుడు పలాసి నవీన్, ఇద్దరు భాషా వలంటీర్లు దాతల నుంచి సేకరించిన రూ. 60 వేలు, మొత్తం రూ. 1. 17 లక్షలతో ఓ భవనం, స్టేజీ నిర్మించారు. శ్రమదానం చేసి పనుల్లో భాగస్వామ్యమయ్యారు. స్థానిక సర్పంచ్ సత్తిబాబు, ఉపాధ్యాయులు, గిరిజన సామాఖ్య జిల్లా నాయకుడు రాధాకృష్ణ పాఠశాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరి

» ఇన్‌చార్జి జేసీ. ఐటీడీఏ పీవో శ్రీపూజ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో శ్రీపూజ

పాడేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాణసంచా విక్రయదారులు విధిగా నిబంధనలు పాటించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్. ఐటీడీఏ పీవో శ్రీపూజ అన్నారు. ఆర్‌డీవో ఎంవీఎస్. లోకేశ్వరరావు అధ్యక్షతన శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాణాసంచా విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఆయా శాఖల అధికారులు బాణసంచా దుకాణాల నిర్వహణపై పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ చైర్మన్ సియ్యారిదొన్నుదొర, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జానపదకళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, ట్రైకార్ డైరెక్టర్ కూడ కృష్ణారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు


పాకలపాటి గురుదేవులకు జ్ఞాపికను అందిస్తున్న బాలరాజు

జి.మాడుగుల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు భక్తిభావలతో మెలగాని మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు సూచించారు. పాకలపాటి గురుదేవుల 14వ వార్షికోత్సవం పురస్కరించుకుని స్థానిక రామాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని 200 మంది అర్చకులకు గురుదేవుల జ్ఞాపికలతో పాటు సన్మానం చేశారు ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం.వెంకటగంగరాజు, సర్పంచ్ రాంబాబు, ఎం. రామారాజు, సింహాచలంరాజు, మత్స్యరాజు బాబురావు, సన్యాసిరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


మెట్టవలస సమీపంలోని రోడ్డు కిందకు దూసుకుపోయిన వ్యాన్

అనంతగిరి, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంగడ పంచాయతీ మెట్టవలస సమీపంలోని ఐచర్‌వ్యాన్ అదుపుతప్పి రోడ్డుకు దూసుకుపోయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వేంగడ వైపు నుంచి వస్తున్న ఈ వ్యాన్ మలుపువద్దకు వచ్చేసరికి బ్రేక్‌ఫెయిలయింది. అయితే, డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. మరి కొద్దిగా ముందుకు వెళ్తే వ్యాన్‌లోయలోపడిపోయేదని స్థానికులు తెలిపారు.

సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణం: ఎంపీపీ

చింతపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. శనివారం మండలంలోని తాజంగి పంచాయతీ వంతమామిడిలో సీసీ రోడ్డు నిర్మాణాకి సర్పంచ్, కూటమి నాయకులతో కలిసి ఎంపీపీ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో అత్యధికంగా సీసీ రోడ్లు, డ్రైన్లుతోపాటూ బోరులు నిర్మిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, ఉప సర్పంచ్ రవి, కూటమి నాయకులు అంద్రాబు లక్ష్మణ్, పాంగి రాము, బోనంగి బాలయ్యపడాల్, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్


ఖోఖో జట్టు విద్యార్థులతో క్రీడల నిర్వాహకులు

పాడేరురూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో శనివారం డివిజన్ స్థాయి స్కూల్స్ గేమ్స్ ఉత్సాహంగా జరిగాయి. స్కూల్ గేమ్ జిల్లా కార్యదర్శి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో, యోగా పోటీల్లో ఏజెన్సీలోని 11 మండలాల నుంచి 670 మంది క్రీడా విద్యార్థులు హాజరయ్యారు. వారికి పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో స్కూల్ గేమ్స్ మాజీ కార్యదర్శి వి.కొండబాబు, వ్యాయామ సంచాలకుల సంఘం కార్యదర్శి భూపతిరాజు, ప్రతినిధులు చంద్రరావు, పద్మ, రాజులమ్మ, ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవ నియంత్రణ పద్ధతులతో తెగుళ్లు కట్టడి

» శాస్త్రవేత్త డాక్టర్ నీరజ


రైతులకు త్రిచోడర్మ్ ప్యాకెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవనియంత్రణ పద్ధతులు పాటించడం వల్ల తెగుళ్ల, కీటకాలను అరికట్టవచ్చునని అంబాజీపేట ఉద్యాన పరిశోధన స్థానం తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బి. నీరజ అన్నారు. శనివారం స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో రైతులకు జీవనియంత్రణ పద్ధతులపై హెచ్‌ఆర్‌ఎస్ అంబాజీపేట ఏఐసీఆర్‌పీ బయో కంట్రోల్ శాస్త్రవేత్తలు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పసుపు, మిరియాల పంటల సాగులో రైతులు నూతన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ప్రధానంగా పసుపులో జీవనియంత్రణ పద్ధతిలో ట్రైకోడర్మ వినియోగించి తెగుళ్లను నిర్మూలించవచ్చున్నారు. చీడపీడలను నియంత్రణకు వేప నూనెను ఉపయోగించుకోవాలన్నారు. స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త చెట్టి బిందు మాట్లాడుతూ పసుపు సాగులో రైతులు కచ్చితంగా కొన్ని మెలకువలు పాటించాలన్నారు. నాట్లు వేసేముందు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు.అనంతరం రైతులకు ట్రైకోడర్మా వినియోగంపై క్షేత్ర ప్రదర్శన ఇచ్చారు.త్రిచోడర్మ్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బి. స్వర్ణలత, బీసీఎఫ్, టాటా ట్రస్టు సాంకేతిక నిపుణుడు డాక్టర్ కె.అప్పలరాజు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

గూడెంకొత్తవీధి: ప్రకృతి సాగు చేపట్టే రైతులకు పనిముట్లు పంపిణీ చేస్తున్నట్టు స్థానిక ఏవో డి. గిరిబాబు అన్నారు. శనివారం మండలంలోని బందవీధి గ్రామంలో గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో రైతులకు పలు రకాల పనిముట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో గిరిజన వికాస్ ప్రతినిధులు యమున, పోతురాజు, మర్రి సత్యనారాయణ, పూజారి బాలరాజు పాల్గొన్నారు.

డోలీ రహిత గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి


:సప్పర్ల సువ్వాపల్లి రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న గిడ్డి ఈశ్వరి

సీలేరు, అక్టోబరు 18 , (ఆంధ్రజ్యోతి) : గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా రహదారుల నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధిలోని సప్పర్ల నుంచి సువ్వాపల్లి వరకు రూ. 4.40 కోట్లతో చేపట్టనున్న రహదారి పనులను శనివారం గిడ్డి ఈశ్వరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో డోలీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సంకల్పిందని, ఈ నేపథ్యంలో మారుమూల గ్రామమైన సువ్వాపల్లికి రహదారికి నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. గతంలో ధారకొండ నుంచి గుమ్మిరేవుల వరకు రహదారికి నిధులు కేటాయించినట్టు తెలిపారు. గత టీడీపీ హయాంలో 5 మండలాల్లో రూ. 800 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టినట్టు వివరించారు. తాజాగా కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి , ఉపముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టిసారించి డోలీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి జాతీయ ఉపాధి హామీ పథకంలో కోట్లాది రూపాయలతో పనులు చేపడుతున్నారన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాతలకు ఆసరా, పింఛన్లు పెంపు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నా రు. ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంలో గూగుల్ సెంటర్‌ను తీసుకువచ్చి అనేక మంది ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సామాన్యుడికి నిత్యావసరాల అందుబాటులో ఉంచేందుకు జీఎస్టీ ధరలు తగ్గించిందన్నారు. అలాగే, ఆర్వీనగర్ నుంచి సీలేరు వరకు రహదారి పనులను ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీ ఆనంద్, జడ్పీటీసీ మాజీ సభ్యులు నళిని, ఎంపీటీసీ సభ్యులు పోతురాజు గోవింద్, కూటమి నాయకులు కృష్ణ, వెంకటేష్, చిన్నారావు, నాగబాబు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం

జి.మాడుగుల, అక్టో బరు 18 (ఆంధ్ర జ్యోతి): తగ్గిన జీఎస్టీ ధరలతో సామన్య కుటుంబాలకు మేలు చేరుకుందని టీడీపీ మండల అధ్యక్షు డు వి.కొండలరావు అన్నారు. ఈ మేరకు శనివారం పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, నాగబ్బాయి, కొండబాబు, సింహాచలం, రామన్నదొర, పిన్నయ్యదొర, లక్ష్మయ్య, నితిన్ పాల్గొన్నారు

హైవే బాధితులకు త్వరలో పరిహారం :తహశీల్దార్


మాట్లాడుతున్న తహశీల్దార్ రాజ్‌కుమార్

జి.మాడుగుల, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): జాతీయ రహదారి బాధితులకు పరిహారాన్ని త్వరలోనే జమ చేస్తామని తహశీల్దార్ జి.రాజ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఆయన గెమ్మెలి పంచాయతీ పరిధి గ్రామాలను శనివారం సందర్శించారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం జాతీయ రహదారి బాధితులతో మాట్లాడుతూ, పరిహారం త్వరలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జబడ సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

ముంచంగిపుట్టు, అక్టోబరు 18, (ఆంధ్ర జ్యోతి): మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ జబడ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శనివారం సర్పంచ్ కె.త్రినాథ్ శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా సర్పంచ్‌మాట్లాడుతూ 15వ ఆర్థిక సం ఘం నిధులు రూ.5 లక్షలతో 100మీటర్ల సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్టు చెప్పారు. నాణ్యతతో సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత సాధురాం, ఉప సర్పంచ్ సత్యం పాల్గొన్నారు.

'మునుశోభ గ్రామ చెక్‌డ్యామ్ మరమ్మతులు చేయాలి'


చెక్‌డ్యామ్‌ను చూపుతున్న గ్రామరైతులు

హుకుంపేట అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బారపల్లి పంచాయతీ మునుశోభ గ్రామ సమీపంలోని చెక్‌డ్యామ్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ చెక్‌డ్యామ్ చాలా రోజుల కిందట శిథిలమైందన్నారు. దీనిపై అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేత శంకరరావు అరకు టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర ఫోన్‌లో సమస్య వివరించారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.


రాజేంద్రపాలేనికి సీసీ రోడ్డు మంజూరు

కొయ్యూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేంద్రపాలెంనకు 200 మీటర్ల సీసీ రోడ్డు నిర్మా ణానికి నిధులు మంజూరైనట్టు మాజీ జీసీసీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు నిధులు విడుదలైనట్టు పేర్కొన్నారు. సర్పంచ్ సింహాచలం, ఎంపీటీసీ సభ్యురాలు నూకలమ్మ పాల్గొన్నారు.

మొక్కలతో ప్రాణవాయువు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన ప్రాణవాయువు పొందాలంటే ప్రజలందరూ అత్యధిక సంఖ్యలో మొక్కలు నాటాలని దేవరాపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు అన్నారు. శనివారం దేవరాపల్లి పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్, సచివాలయం ఉద్యోగులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్వామి నాయుడు, కూటమి నాయకులు రామారావు, రాజారావు, పేసా కమిటీ కార్యదర్శి రామలింగం పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి సంబరాలు


దీపారాధనలో చిన్నారులు

జి.మాడుగుల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమేశ్ ఆధ్వర్యం లో చిన్నారులు దీపరాధన చేపట్టారు.

చెత్త సమస్యకు పరిష్కారం లేదా?

... 7వ పేజీ తరువాయి

పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా కనీసం డంపింగ్ యార్డుకు స్థలాన్వేషణ కూడా జరగడం లేదు. జీవీఎంసీ, రెవెన్యూ అధికారులకు డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని ఎంపిక చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశించినా అధికారులు మాత్రం స్థలాన్ని కేటాయించే ప్రయత్నాలు చేయడం లేదు. దీంతో డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం దొరుకుతుందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





చోడవరం: ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు... ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



బుచ్చెయ్యపేట: సీతయ్యపేటలో కేక్ కట్ చేస్తున్న గేదెల సత్యనారాయణ

ఘనంగా ఎమ్మెల్యే రాజు జన్మదిన వేడుకలు

విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలు

ఆలయాల్లో టీడీపీ శ్రేణుల ప్రత్యేక పూజలు

చోడవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేకులు కట్ చేశారు. అలాగే విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. చోడవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ నాయకులు మల్లునాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, మత్స్యరాజు, పెదబాబు, జనసేన నాయకులు సిరిపురపు రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ మూలినాయుడు, జెర్రిపోతుల నానాజీ, కర్రి రమేశ్, టీడీపీ యువనాయకులు సకురు కోటేశ్వరరావు, సేనాపతి శ్రీనివాసరావు, రమణ, అద్దూరు రమేశ్ తదితరులు కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ యూత్ నాయకుడు సకురు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలో కొత్తూరు జంక్షన్‌లో శనివారం తెల్లవారు జామున పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, రమేశ్ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, రెట్టెలను బొడ్డేడ గంగాధర్, మల్లునాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవరపల్లి వెంకట అప్పారావు, గొర్లె సుధాకర్. పప్పు శ్రీను, బొబ్బిలి ఈశ్వరరావు, బాలిబోయిన దేవుడు పాల్గొన్నారు. అలాగే దుడ్డుపాలెం పాలసంఘం అధ్యక్షుడు పాకలపాటి రామనారాయణరాజు, నరసయ్యపేట పాల సంఘం మాజీ అధ్యక్షుడు కోరిబిల్లి దేముడు తదితరుల ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుపతిలో ఉన్న ఎమ్మెల్యే రాజును, టీడీపీ మండల నాయకులు పల్లా అర్జున్, పట్టణ అధ్యక్షుడు ఎర్రంశెట్టి చిన్న కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు అందించారు.

రావికమతంలో...

రావికమతం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ, జనసేన,



రావికమతంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న నాయకులు



బుచ్చెయ్యపేట: పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న గేదెల సత్యనారాయణ

బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రావికమతంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరావు, మండల మాజీ అధ్యక్షుడు రాజాన కొండ నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేయించిన 59 కిలోల కేక్‌ను కట్ చేశారు. అలాగే బాణసంచాతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుతూ ఆలయాల్లో పార్టీ నాయకులు ప్రత్యేకంగా పూజలు చేశారు. అలాగే గర్నికం జనసేన కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైచర్ల నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజు జన్మదిన వేడుకల కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, గొంప ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొర్లె సాంబశివ, మాజీ డైరెక్టర్ రౌతు సత్యనారాయణ, నాయకులు వేపాడ నాగేశ్వరావు, రాంబాబు, బి.శ్రీను, వి.శివ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్యే రాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పంచాడ చంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 24 పంచాయతీల నుంచి పార్టీ శ్రేణులు తరలివచ్చి కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పంచాడ చంద్ర మాట్లాడుతూ రోలుగుంట మండల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు పిట్ల బుల్లిబాబు, మాజీ అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ సుర్ల బాబులునాయుడు, నాయకులు కోలిపల్లి ఈశ్వరరావు, రెడ్డి నారాయణరావు, ఓనుం శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, వి.రమణాజీ, ఎస్.పెద్దినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో కూటమి నాయకులు ఎమ్మెల్యే రాజు జన్మదిన వేడుకలను నిర్వహించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు చీరలు, పీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు అందించారు. అలాగే వడ్డాది వెంకన్న ఆలయంలో ఎమ్మెల్యే రాజు పేరుతో నాయ కులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. సీతయ్యపేటలో కరణం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే రాజు జన్మదిన వేడుకల్లో గేదెల సత్యనారాయణ కేకు కట్ చేశారు. తురకలపూడి పీహెచ్‌సీలో రోగులకు డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు జి.కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షులు దొడ్డి కిశోర్, కోట సత్యనారాయణ, దొండా శ్రీను, డి.అప్పలనాయుడు, వి.సత్తిబాబు, తెలుగు యవత మండల అధ్యక్షుడు సింగంపల్లి రమేశ్, కూటమి నాయకులు ఎంవీవీ తాతీలు, తమరాన దాసు పాల్గొన్నారు.



రోలుగుంట: ఎమ్మెల్యే రాజు పుట్టిన రోజు కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

భూ సమస్యలపై ఫిర్యాదు చేయండి

మాకవరపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు ఉంటే మండల స్థాయి కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ బి.వెంకటరమణ సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పైడిపాల, మల్లవరం, నారాయణరాజుపేట, మాకవరపాలెం, కొండల అగ్రహారం గ్రామాల్లో పీజీఆర్ఎస్‌లో వచ్చిన భూ సమస్యలపై విచారణ చేశారు. గ్రామాల్లో చిన్న చిన్న భూ సమస్యలు ఉంటే నేరుగా రెవెన్యూ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమస్యలపై వివాదాలకు పోవద్దని చెప్పారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల‌ను ప్రతి నెలా మూడో శనివారం మండల స్థాయి కమిటీ అధ్వర్యంలో పరిష్కారస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు, ఎంపీడీవో చాయిసుధ, పంచాయతీరాజ్ శాఖ జేఈ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్‌లు

నాతవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలకు సీలింగ్ ఫ్యాన్లను సర్పంచ్ గొలగాని రాణి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవిలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఇబ్బందులు పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ ఫ్యాన్లు అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఎన్.వెంకటరమణ, నాతవరం పీఏసీఎస్ ఛైర్మన్ అప్పిరెడ్డి మాణిక్యం, వైసీపీ మేధావుల విభాగం మండల అధ్యక్షుడు పైల పోతురాజు, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు కార్యదర్శి లాలం శేషు తదితరులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణలను అడ్డుకోండి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవాలని సర్పంచ్ సీతా బుజ్జి డిమాండ్ చేశారు. గ్రామస్థులతో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 156లో 216 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దీన్ని ఆక్రమించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఎక్స్‌కవేటర్ల సాయంతో కొండపై తుప్పలు తొలగించి భూములను చదును చేస్తున్నారని చెప్పారు. వెంటనే ఆక్రమణలు అడ్డుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

స్వచ్ఛభారత్ అందరి బాధ్యత

చీడికాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని పంచాయతీ కార్యదర్శి పి.పద్మావతి చెప్పారు. శనివారం సచ్ఛభారత్‌పై గ్రామ స్థాయి ఉద్యోగులు, మహిళలు, వివిధ పార్టీల నాయకులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ పరిశుభ్రతలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ర్యాలీలో నాయకులు చెరువూరి శివాజీరాజు, ఎస్‌విఎస్.నాయుడు, శ్రీనాధు విజయ్ పాల్గొన్నారు.

గాంధీగ్రామంలో చిరు వ్యాపారులకు ఊరట

» తొలి విడతలో 30 మందికి అధీకృత పత్రాల జారీ



చిరు వ్యాపారులకు అధీకృత పత్రాలు అందిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

చోడవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీ గ్రామం పంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన చిరు వ్యాపారులకు అధీకృత పత్రాలను పంచాయతీ పాలకవర్గం జారీ చేసింది. ఏడాదికి రూ.3 వేలు పంచాయతీకి పన్ను చెల్లించే నిబంధన మేరకు ఈ దుకాణదారులకు అనుమతి పత్రాలు మంజూరు చేసింది. వీటిని పంచాయతీ కార్యాలయంలో చిరు వ్యాపారులకు శనివారం అందించారు. పంచాయతీ పరిధిలోని సుమారు 60 దుకాణాలు ఉన్నాయని, వీటి ద్వారా ఏడాదికి పంచాయతీకి సుమారుగా రూ.2 లక్షల వరకూ ఆదాయం వచ్చేందుకు అవకాశం ఉందని సర్పంచ్ గాడి అప్పారావు తెలిపారు. పంచాయతీలో సంపద సృష్టి కార్యక్రమాలు అమలు చేయాలన్న ప్రభుత్వ ప్రణాళికల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, తొలి విడతలో 30 మందికి అధీకృత పత్రాలు ఇస్తున్నామని తెలిపారు. మిగిలిన వారికి కూడా పత్రాలు జారీ చేస్తామని వివరించారు. ఈ పత్రాలు లేకపోవడం వల్ల విద్యుత్ సౌకర్యానికి నోచుకోకుండా, వ్యాపారాలు సక్రమంగా సాగక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోలా రమణ, వార్డు సభ్యులు యాదగిరి సాయి, పొట్నూరు శ్రీను, కారు శ్రీను, గుర్రే సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

నర్సీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలని సీఐ గోవిందరావు స్పష్టం చేశారు. పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను అగ్నిమాపక, రెవెన్యూ అధికారులతో సంయుక్తంగా శనివారూం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నంలో 40 దుకాణాలకు ఆర్డీవో అనుమతులు ఇచ్చారన్నారు. దుకాణాల మధ్య పది అడుగుల దూరం పాటించాలని సూచించారు. డ్రమ్ములతో నీరు, మగ్గు అందుబాటులో ఉంచాలని సూచించారు. అగ్నిమాపక కేంద్రానికి చలానా తీయాలన్నారు. ప్రమాదం జరిగితే లైసెన్స్‌దారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి అప్పలస్వామి, ఎస్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరిలోవ ధన్వంతరీ వనంలో నగర వనం

గొలుగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అరిలోవ అటవీ ప్రాంతలోని ధన్వంతరీ వనంలో నగర వనం ఏర్పాటు చేస్తున్నామని రేంజ్ అధికారి కేవీ రాజేశ్వరరావు తెలిపారు. శనివారం సిబ్బందితో కలిసి ధన్వంతరీ వనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వనం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.1.15 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో వాకింగ్ ట్రాక్, పార్కు, ట్రెక్కింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ముగిసిన పోషకాహార మాసోత్సవాలు

రోలుగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పోషకాహార మాసోత్సవాలు శనివారంతో ముగిశాయి. జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మిరమణమ్మ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలింతలు, గర్భిణుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలిపొందిన విజేతలకు విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హేమ, ఎస్.కె.ఉన్నిష తదితరులు పాల్గొన్నారు

కోతుల బెడద లేకుండా చూడాలి

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోతుల బెడదను నివారించాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవోకు విన్నవించారు. కొన్నేళ్లుగా గ్రామాల్లో ఎక్కడ చూసినా కోతుల సంచారం పెరిగిపోయిందని, వీటివల్ల పంటలకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో కోతులను నివారించాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

మాకవరపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జి.కోడూరు గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురైన ఉలవపర్తి అప్పయ్యమ్మ కుటుంబానికి జనసేన సీనియర్ నేత దొరబాబు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా తగిన సహాయం అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన బీజేపీ నేత బోడ్డేటి వెంకటరమణ, టీడీపీ సీనియర్ నేత మళ్ల జయబాబు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు శేషు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం అభినందనీయం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అన్నదానం అందించడం అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్ చెప్పారు. తన జన్మదినం సందర్భంగా గ్రామంలోని నిరుపేద వృద్ధులకు అన్నదానంతో పాటు పాలు, పండ్లు అందించారు. కార్యక్రమంలో తెలుగుయువత మండల కార్యదర్శి ఎన్.అప్పలరాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు డి.సతీశ్, ఎ.వరహాలబాబు, సభ్యులు పాల్గొన్నారు.

బోర్ల రిగ్ ప్రారంభం

బుచ్చెయ్యపేట అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ ఆగ్రహారంలో రెండు తాగునీటి బోర్ల రిగ్ ప్రారంభించినట్టు జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సర్పంచులు జి.శ్రీనివాసరావు, మాణిక్యం, పి.రామునాయుడు, పి.నాయుడు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

చీడికాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరహాపురం ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్-14, 17 విభాగానికి చెందిన 13 ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు పోటీలకు హాజరయ్యారు. పోటీలను హైస్కూల్ కమిటీ చైర్మన్ మిస్కా అప్పారావు యాదవ్ ప్రారంభించారు. సాయంత్రం వరకూ అన్ని విభాగాల్లోను పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం డి.వరహామూర్తి, పీఈటీలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి వనరులు గుర్తించాలి

చీడికాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి వనరులు గుర్తించాలని ఎంపీడీవో హేమ సుందర్రావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు జరిగిన రెండు రోజులు శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనరుల గుర్తింపు ద్వారా ఆదాయం పెంచాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో పట్నాల గోపి, టీవోటి సంతోశ్ పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్

మాడుగుల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు శివాలయాలకు వెళ్లే మార్గంలో శనివారం జంగిల్ క్లియరెన్స్ పనులను పంచాయతీ పాలకులు చొరవ తీసుకుని చేపట్టారు. రానున్న కార్తీక మాసంలో సాధారణ భక్తులతో పాటు మాలధారణ భక్తులు శివాలయాలకు వెళుతుంటారు. శివాలయాలకు రోడ్డుకిరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టినట్టు స్థానికులు చెబుతున్నారు.

వరహా నదిలో గల్లంతైన వ్యక్తి మృతి

నర్సీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం వరహానదిలో గేదెలను కడగడానికి వెళ్లి గురువారం సాయంత్రం గల్లంతైన పల్లి రామకృష్ణ (45) మృతదేహం శనివారం లభ్యమైంది. ఉదయం మృతదేహాన్ని గమనించిన గ్రామస్థులు మృతిని బంధువులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలిచారు. మృతుడు రామకృష్ణకు భార్య, కుమార్తె ఉన్నారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు

నాతవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులపై దాడిచేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. చెర్లోపాలెం గ్రామానికి చెందిన పెద్దపూడి రవికుమార్ (27) మద్యం మత్తులో కర్రతో తల్లిదండ్రులు, తాతపై దాడి చేసినట్టు చెప్పారు. గాయాలతో ఉన్న తల్లిదండ్రులను ఆసుపత్రికి తరలించామన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పెద్దపూడి రవికుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించగా, 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఆయన తెలిపారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ



అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ వినియోగం తగ్గించుకునేందుకు ప్రజలు సూర్యఘర్ పథకంపై అవగాహన పెంచుకుని వినియోగించుకోవాలన్నారు. జీఎస్టీ తగ్గుదల వల్ల పలు రకాల వస్తువులపై ఆర్థిక భారం తగ్గిందన్నారు. అలాగే జీఎస్టీ తగ్గుదల వల్ల వ్యాపారులకు కూడా భారం తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కూటమి నాయకులు నందారపు సన్యాసిరావు, లక్ష్మీనారాయణ, రమేశ్, ఏఈ రాంబాబు, ఈవో నాయుడు, కూటమి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో ఎనలేని లాభాలు

ఈపీడీసీఎల్ ఏడీఈ సురేశ్‌కుమార్



జీఎస్టీపై ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

చోడవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీతో విద్యుత్ వినియోగారులకు ఎనలేని ప్రయోజనాలు లభిస్తున్నాయని ఈపీడీసీఎల్ ఏడీఈ వై.సురేశ్ కుమార్ తెలిపారు. జీఎస్టీపై శనివారం విద్యుత్ ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ పథకాల ద్వారా వినియోగదారులకు లభిస్తున్న రాయితీలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ ర్యాలీలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో ఆంజనేయులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టక్ బొడ్డేడ నాగగంగాధర్, పీఏసీఎస్ చైర్మన్ గూనూరు మూలినాయుడు, కూటమి నాయకులు గూనూరు మల్లునాయుడు, సిరిపురపు రమేశ్, కందర్ప రమణమూర్తి పాల్గొన్నారు. ర్యాలీలో చోడవరం, చోడవరం రూరల్, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల విద్యుత్ సంస్థ ఏఈలు డీఎస్ఎన్ రాజు, ఉదయ్‌కుమార్, శంకరరావు, చంద్రశేఖర్, ఎస్.రవికుమార్, మూడు మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

రావికమతం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల ప్రత్యేయాధికారి సుజాత చెప్పారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన సందర్భాలోనే పెంట్రోల్ వాహనాలు ఉపయోగించాలన్నారు. దగ్గర పనులకు వెళ్లే సమయంలో సైకిల్‌ను వినియోగించడం మంచిదన్నారు. దీనివల్ల కొంత మేర వాయు కాలుష్యం తగ్గించవచ్చునని ఆయన ఆకాక్షించారు. అంతకు ముందు నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థులు, అధికారులు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాధనకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.